క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



బోల్తా పడిన కారు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. హైవే పెట్రోల్ సిబ్బంది తెలిపిన మేరకు.. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో నివాసముంటున్న దుద్దెల మహేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఓ వివాహ వేడుకను చూసుకొని తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. పాణ్యం వద్దకు రాగానే కారు ముందరి టైర్ ఊడిపోవడంతో వాహనం పక్కనే ఉన్న గుంతలో బోల్తా పడిపోయింది. దీంతో కారులో ఉన్న మహేశ్వరరెడ్డితో పాటు రాజశేఖర్‌రెడ్డి, సాయిచందన్‌రెడ్డి, వసుంధరకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నంద్యాల ఆస్పత్రికి తరలించారు.

ప్రత్యేక ఫాతెహాలు



స్వాముల వారికి జెండాలను తీసుకెళ్తున్న దృశ్యం

ఓర్వకల్లు: హజరత్ సయ్యద్ సుల్తాన్ మహబూబ్‌షా ఖాద్రీ ఉరుసు సందర్భంగా గురువారం సాయంత్రం స్వాముల వారికి దర్గా పీఠాధిపతి ఎస్ఎండీ నజురుల్లాషా ఖాద్రీ ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. గురువుల వారి స్వగృహం నుంచి జెండాలు తీసుకెళ్లి స్వాముల వారికి సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో స్వాముల వారికి కాయ చక్కెరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా స్వాముల వారిని దర్శించుకోవడం సంతోషకరమన్నారు.

ఫిజియోథెరపీ సేవల పరిశీలన



ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓ

కల్లూరు: కల్లూరు అర్బన్ ముజఫర్‌నగర్‌లోని గోవర్ధన్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలను ఎంఈఓ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై సంబంధిత సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ముజఫర్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఆర్‌టీ–3 పరీక్షను పరిశీలించారు. అయితే కొంత మంది విద్యార్థులు పరీక్ష సమయానికి హాజరుకాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుతున్న 25 మంది విద్యార్థినులకు టాటా మోటర్స్ వారి ఆధ్వర్యంలో స్కాలర్‌షిపులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టాటా కంపెనీ జోనల్ హెడ్ రామిరెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కూలీ రేట్లు పెంచాలి



ఉలిందకొండ గ్రామంలో ర్యాలీ చేస్తున్న కార్మికులు

కల్లూరు: కంకర మిషన్ల క్వారీలలో పని చేస్తున్న కార్మికుల కూలీ రేట్లు పెంచాలని సీపీఎం మండల కార్యదర్శి కె.మధు డిమాండ్ చేశారు. గురువారం ఉలిందకొండ గ్రామంలో కంకర మిషన్ల క్వారీలలో కంకర కొట్టి జీవనం కొనసాగిస్తున్న 200 మంది కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ప్రతి రెండు సంవత్సరాలకు కూలీల రేట్లు పెంచేలా అగ్రిమెంట్ చేశారని, గత ఏడాది డిసెంబర్‌కు అగ్రిమెంట్ పూర్తయిన ఇంత వరకు కూలీల రేట్లు పెంచకుండా యాజమాన్యాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని వారు ఆరోపించారు. ర్యాలీ అనంతరం కర్నూలు నగరంలోని లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లింగన్న, రంగన్న, మారన్న, పూల రంగడు, రంగస్వామి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హయగ్రీవ ఇష్టి

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులోని మామిదాలపాడు సమీపంలోని గోదా గోకులంలో నిర్వహించనున్న శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆల్వారాచార్యుల దేవతామూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం హయగ్రీవ ఇష్టి అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ద్వారతోరణ ధ్వజ, ఘృతకుంభాభిషేకం, బాలభోగ నివేదన తదితర కార్యక్రమాలు జరిగాయి. అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కళాకారులు గరిమెళ్ల సత్యవతి, గరిమెళ్ల సీతా మహాలక్ష్మి, గరిమెళ్ల అంజనీదేవిల బుర్రకథాగానం అలరించింది.

‘మధ్యాహ్నం’.. పోషక మిళితం

- 2 నుంచి జగనన్న గోరుముద్దలో చేరనున్న రాగిజావ
- వారానికి మూడు రోజుల పాటు అమలు
- విద్యార్థులకు మరింత పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు



మిలిటరీకాలనీ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ (ఫైల్)

కర్నూలు (న్యూటౌన్): జగనన్న గోరుముద్ద(మధ్యాహ్న భోజన పథకం)లో మరో పోషకాహారం చేరనుంది. సర్కారు బడుల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం మరింతగా పోషక మిళితంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. పిల్లలకు తగినంత ఐరన్, కాల్షియం అందించేందుకు వీలుగా మార్చి 2వ తేదీ నుంచి మధ్యాహ్న భోజన మెనూలో అదనంగా ‘రాగి జావ’ను చేర్చనుంది. ప్రస్తుతం జగనన్న గోరుముద్ద మెనూలో ప్రతి రోజూ గుడ్డు, చెక్కీతో సహా రోజుకో వెరైటీ కూరతో పోషకాహారాన్ని అందిస్తున్నారు. విద్యార్థుల్లో రక్తహీనత కనిపిస్తున్న నేపథ్యంలో ఈ మెనూకి అదనంగా రాగిజావను చేర్చారు. వారానికి మూడు రోజుల పాటు మంగళ, గురు, శనివారాల్లో రాగిజావ ఇవ్వనున్నారు. దీని కోసం ప్రతి పాఠశాలకు రాగి పిండి, బెల్లం ప్రభుత్వమే సరఫరా చేయనుంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులకు మేలు జరగనుంది.

జగనన్న గోరుముద్ద పథకం ప్రస్తుత మెనూ

సోమవారం : వెజ్‌పలావు, గుడ్డు కూర, చిక్కీ
మంగళవారం: పులిహోర, దొండకాయచెట్నీ, గుడ్డు
బుధవారం : వెజ్ బిర్యానీ, బంగాళదుంప కూర, గుడ్డు, చెక్కీ
గురువారం : లెమన్ రైస్, టమాట చెట్నీ, గుడ్డు
శుక్రవారం : పప్పు ఆకుకూర, అన్నం, గుడ్డు, చిక్కీ
శనివారం : ఆకుకూరతో చేసిన అన్నం, స్వీట్ పొంగల్

కోడుమూరు నియోజకవర్గం ‘జగనన్న గోరుముద్ద’ వివరాలు..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	భోజనం చేస్తున్న విద్యార్థులు
కోడుమూరు	52	9,798	9,798
గూడూరు	32	5,326	5,326
సి.బెళగల్	44	9,582	9,582
కర్నూలు	191	31,334	31,334
మొత్తం	319	56,040	56,040

రాగిజావ అందించేందుకు సన్నాహాలు చేస్తున్నాం



జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రాగిజావ అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. దీని కోసం సన్నాహాలు చేస్తున్నాం. ప్రతి పాఠశాలకు రాగిపిండి, బెల్లం ప్రభుత్వమే సరఫరా చేయనుంది. మార్చి 2వ తేదీ నుంచి జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిజావని విద్యార్థులకు అందిస్తాం.

–కె.వినోద్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎంఈఓ, కర్నూలు మండలం

రాగిజావలో పుష్కలంగా పోషకాలు



రాగిపిండిలో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకల ధృడత్వానికి ఎంతో ఉపయోగ పడుతుంది. వేరుశనగ, నువ్వులు, ఆకుకూరలు, గుడ్డుతో పాటుగా రాగి పిండిలో ఐరన్ కంటెంట్ ఉంటుంది. ఇవి విద్యార్థుల్లో రక్తహీనతను నివారించి శక్తిని, బలాన్ని అందిస్తాయి. పిల్లల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుంది

– ఓంకార్ యాదవ్, పంచలింగాల జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం

సీఎం జగన్‌తోనే సామాజిక విప్లవం

- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- తప్పుడు వార్తలు ప్రచురణను నిరసిస్తూ ‘ఈనాడు’ ప్రతులు దహనం



ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

కర్నూలు (న్యూటౌన్): బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రాజకీయ పదవులిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక విప్లవం సాధ్యమైందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం స్థానిక స్టాంటన్‌పురంలోని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాసన మండలిలో 18 ఎమ్మెల్సీ స్థానాలకుగానూ 14 బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు, 4 ఓసీ వర్గాలకు చెందిన అభ్యర్థులను ముఖ్యమంత్రి ఖరారు చేయడం శుభపరిణామమని అన్నారు. చట్ట సభల్లో 60 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పదవులిచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు దమ్మూ ధైర్యం ఉంటే రాబోయే ఎన్నికల్లో పొత్తులు లేకుండా ఒంటరిగా పోటీ చేయాలని సవాల్ విసిరారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం అట్టర్ ప్లాప్ అయిందని ఎద్దేవా చేశారు. పప్పు నాయుడు రోడ్డు మీదకు వచ్చి బండ బూతులు తిట్టడం తప్ప చేసిందేమీ లేదని, యువగళం కాదు పప్పుగళమని విమర్శించారు. గతంలో చంద్రబాబు కమ్మ సామాజిక వర్గానికే పదవులన్నీ కట్టబెట్టారని, అయితే ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు నామినేటెడ్ పదవులతో పాటు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బరిలో నిలిపారని కొనియాడారు. చంద్రబాబు మీడియా మేనేజ్‌మెంట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తూ వ్యవస్థలను మేనేజ్ చేయడంలో దిట్ట అని ఆరోపించారు. ‘ఈనాడు’ పత్రికలో గన్నవరంలో పట్టాభిపై దాడి జరగకపోయినా తప్పుడు వార్తలను ప్రచురించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమాజంలో ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉండాల్సిన ఎల్లో మీడియా తప్పుడు కథనాలు రాసి ప్రజల్లో అబాసుపాలవుతోందన్నారు. అనంతరం తప్పుడు కథనాలను నిరసిస్తూ ఈనాడు దినపత్రిక ప్రతులను ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు దహనం చేశారు. సమావేశంలో డీవీఎంసీ రవిశాస్త్రి, వైస్ ఎంపీపీ2 నెహేమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, సొసైటీ చైర్మన్లు శేషిరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీటీసీ రామ్‌నాథ్‌రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షులు వాసు, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, సర్పంచ్‌లు బాలకృష్ణ, విద్యాసాగర్, ఉప సర్పంచ్ కౌశిక్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి



అనుగొండ గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కర్నూలు డివిజనల్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి సూచించారు. గురువారం డీఎల్‌డీఓ స్థానిక ఎంపీడీఓ చంద్రశేఖర్‌తో కలిసి మండలంలోని లద్దగిరి, అనుగొండ గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. అదేవిధంగా గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భారత్ సర్వేను త్వరగా పూర్తి చేసి ప్రతి కుటుంబానికి ఇన్సూరెన్స్ కార్డులివ్వాలని, సున్నా నుంచి 5 సంవత్సరాల పిల్లలకు బాల ఆధార్ పూర్తి చేసి ఎస్‌డీజీ సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి రోజు గ్రామ సచివాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. స్పందన ద్వారా వచ్చే ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో రక్తహీనతతో బాధపడుతున్న బాలబాలికలు, గర్భవతులను గుర్తించి వారికి మంచి పౌష్టికాహారం, మందులివ్వాలన్నారు. బాల్యవివాహాలు జరగకుండా మహిళా పోలీసులు చర్యలు తీసుకోవాలని, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న అమ్మఒడి, కల్యాణమస్తు, షాదీతోఫాపై ప్రజలకు వలంటీర్లు అవగాహన కల్పించి అర్హులకు అందేలా చూడాలని డీఎల్‌డీఓ సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయఢంకా మోగిద్దాం

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి
- ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయఢంకా మోగించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తరఫున పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంఎస్ రామచంద్రారెడ్డిని గెలిపించుకోవాలన్నారు. మార్చి 13వ తేదీన జరిగే ఎన్నికల్లో వీరి గెలుపునకు నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ విభాగాలతో పాటు అభిమానులు కృషి చేయాలన్నారు. అన్ని వర్గాలకు మేలు చేస్తున్న ప్రభుత్వానికి యువత, ఉద్యోగులు ఓటుతో మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రి, కోడుమూరు మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, గూడూరు ఎంపీపీ బొంతల మునెప్ప, గూడూరు అర్బన్ కన్వీనర్ ఎల్ వెంకటేశ్వర్లు, రూరల్ కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మన్న, సి.బెళగల్ మండల కన్వీనర్ తులసిరెడ్డి, మునగాల సర్పంచ్ గోపాల్, కర్నూలు మండల వైస్ ఎంపీపీ2 నెహేమ్యా, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఇమ్మానియేలు, కర్నూలు అర్బన్ కన్వీనర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలుకు వేలంపాట



చనుగొండ్ల నాగలింగేశ్వరస్వామి దేవాలయంలో వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలోని శ్రీ కేశవ, నాగలింగేశ్వరస్వామి దేవాలయానికి చెందిన భూములను కౌలు ప్రతిపాదికన ఇచ్చేందుకు గురువారం ఆలయ కార్యనిర్వహణ అధికారి గుర్విరెడ్డి బహిరంగ వేలంపాట నిర్వహించారు. స్థానిక దేవాలయంలో నిర్వహించిన వేలంలో ఐదుగురు పాటదారులు పాల్గొన్నారు. ఆలయానికి సంబంధించి సర్వే నంబర్లు 81 నుంచి 93, 262లో ఉన్న మొత్తం 27 ఎకరాల భూమి కౌలుకు బోయ గుడిసె శివ రూ.1.36 లక్షలు, దస్తగిరి రూ.36 వేలు, కుమార్ రూ.41 వేలు చొప్పున ముగ్గురు వ్యక్తులు రూ.2.08 లక్షలకు పాడి భూములను దక్కించుకున్నట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ రంగన్న తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో హజరత్ సయ్యద్ సుల్తాన్ మహబూబ్‌షా ఖాద్రీ ఉరుసును పురస్కరించుకొని గురువారం దర్గా పీఠాధిపతులు నజురుల్లాషా ఖాద్రీ, జెడ్పీహెచ్ పాఠశాల పీఎంసీ చైర్మన్ మద్దిలేటితో కలిసి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు.

సుంకేసులకు 460 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు గురువారం 460 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, డ్యాంలో 0.581 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కేసీ కాల్వకు 817 క్యూసెక్కుల నీటి విడుదల చేశారు.

నేడు ఓర్వకల్లులో ఆటల పోటీలు

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లులో హజరత్ సయ్యద్ సుల్తాన్ మహబూబ్‌షా ఖాద్రీ ఉరుసు సందర్భంగా శుక్రవారం ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటలకు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారు. ఇందులో గెలుపొందిన క్రీడాకారులకు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ. వెయ్యి చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేస్తారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.200లు ప్రవేశ రుసుం చెల్లించి కమిటీ సభ్యుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలి. అలాగే మధ్యాహ్నం ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీలలో ప్రతిభ కనపరచినవారికి మొదటి రెండు స్థానాలకు గాను వరుసగా రూ.2 వేలు, రూ.వెయ్యిల చొప్పున నగదు బహుమతులు అందజేస్తారు. ఆసక్తి గల వారు రూ.50 లు ప్రవేశరుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. సాయంత్రం నిర్వహించే స్లో మోటర్ సైకిల్ పోటీలలో ప్రతిభ చూపిన వారికి తొలి రెండు స్థానాలకు గాను వరుసగా రూ.2 వేలు, రూ.వెయ్యిల చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేస్తారు. ఆసక్తి గల వారు రూ.50 లు ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



మందుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు: మండలంలోని రైతులు భూసార పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా పంటలు, ఎరువులను వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని పులకుర్తి రైతుభరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించడంతో పాటు రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రైతులు తమ భూములను భూసార పరీక్షలు చేయించడం ద్వారా పొలాల్లో ఏయే పోషకాహాలు, లోపాలున్నాయో తెలుసుకుని వాటిని నేలకు అందించడం ద్వారా మంచి పంట దిగుబడులను సాధించవచ్చునన్నారు. శనగ సాగు చేసిన రైతులు మార్కెట్‌లో తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుని నష్టపోకుండా, ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరకు తమ దిగుబడులను అమ్ముకోవాలన్నారు. అనంతరం ఏఓ కోడుమూరులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు.

గ్రౌండ్ ట్రూతింగ్ పనులను పూర్తి చేయండి

కర్నూలు(సెంట్రల్): పెండింగ్‌లో ఉన్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని భూపరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రీసర్వే, భూ హక్కు పత్రాల పంపిణీ, స్పందన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొన్ని జిల్లాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, అందుకు కారణాలను సంబంధిత కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రీసర్వేకు సంబంధించి విలేజ్ సర్వేయర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు వీర్వోల లాగిన్‌లో డేటాను అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి గ్రామంలో డ్రోన్ సర్వే చేసే ముందు డ్రోన్ కంట్రోలర్ పాయింట్‌ను, మార్కులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్ చేసిన తరువాత 9(2),10(2) నోటీషులను రైతులకు ఇచ్చి ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించాలన్నారు. అలాగే క్యూఆర్ఐ మ్యాపులు వచ్చిన తరువాత సెక్షన్ 13 కింద నోటిఫికేషన్ ఇవ్వడానికి ఎంత సమయం పడుతుందని అధికారులను అడగా 90 రోజుల్లో పనిని పూర్తి చేయవచ్చని కలెక్టర్లు వివరించారు. కార్యక్రమంలో సర్వే ఏడీ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అభినందనీయం



విద్యార్థినులకు ఐరన్ మాత్రలు వేస్తున్న రాష్ట్రీయ బాల స్వస్థ్య సమన్వయకర్త హేమలత

కర్నూలు (న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అభినందనీయమని రాష్ట్రీయ బాల స్వస్థ్య సమన్వయకర్త హేమలత అన్నారు. గురువారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న విఫ్స్ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల వల్ల రక్తహీనత సమస్య రాదని సూచించారు. కిశోర బాలికలలో నెలసరి ఉంటుందని, అలాంటి వారు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో 104 వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు(లీగల్): రంగారెడ్డి కోర్టు న్యాయవాది సురేందర్‌పై జరిగిన భౌతిక దాడిని ఖండిస్తూ శుక్రవారం కర్నూలు జిల్లా న్యాయవాదులు తమ విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్నట్లు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఎం.ఆర్.కృష్ణ, కాటం రంగడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

28న గాడిచెర్ల వర్ధంతి

కర్నూలు కల్చరల్: గాడిచెర్ల ఫౌండేషన్, కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ, ఏపీ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలోని శ్రీ సర్వోత్తమ భవనంలో ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు 63వ వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి రావి శారద గురువారం తెలిపారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌జీ చంద్రశేఖరరెడ్డి

గడివేముల: ప్రజలు, రైతుల సమస్యలను అధికారులు సకాలంలో పరిష్కరించాలని, వారిని అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని ఎంపీపీ నాగమద్దమ్మ, జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని అధికారులకు సూచించారు. మండల మీట్‌లో ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వివరించారు. గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చూడాలని సభ్యులు కోరారు. మండలానికి జలజీవన్ మిషన్ కింద రూ.7.90 కోట్లు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్ తెలిపారు. ఆయా గ్రామాల్లో త్వరలోనే పనులను ప్రారంభిస్తామన్నారు. సోమాపురం గ్రామ సమీపంలోని సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు మరమ్మతు పనులు పూర్తయినట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి రోజు చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నామని సూపర్‌వైజర్ కుమారి వివరించారు. ఇళ్లు నిర్మించుకుంటున్న ప్రతి ఒక్కరికి త్వరితగతిన బిల్లు చేయడం జరుగుతుందని హౌసింగ్ ఏఈ మూర్తి తెలిపారు. పాడిరైతులకు ముద్దచర్మ వ్యాధి గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పశువులకు టీకాలు వేస్తున్నట్లు పెసరవాయి పశువైద్యాధికారి షేక్ బాబా ఫకృద్దీన్ తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం మంజూరు చేస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ.. సమావేశానికి హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని ఎంపీడీఓ విజయసింహారెడ్డిని కోరారు.

మండల కేంద్రంతో పాటు మంచాలకట్ట, కొర్రపాలూరు రహదారులు భారీ వాహనాలతో దెబ్బతిన్నాయని, భారీ వాహనాలు గ్రామంలోకి రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డి, ఎంఈఓ రామకృష్ణ, హార్టికల్చర్ అధికారిణి దివ్య, వైస్ ఎంపీపీలు హైమావతి, కాలునాయక్, ఎంపీటీసీలు మహేశ్వరరెడ్డి, రామస్వామి, సైమన్, సర్పంచ్‌లు అంజనమ్మ, శేఖర్, కత్తి తులసమ్మ తదితరుల పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించండి



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సి.బెళగల్: మార్చి 13వ తేదీ జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు లక్ష్మీకాంతరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. మండల కేంద్రం సి.బెళగల్‌లో గురువారం సర్పంచ్ పాండురంగన్న తదితరులతో కలిసి ప్రచారం చేపట్టారు. వెన్నపూస రవీంద్రరెడ్డి గెలుపునకు కృషి చేయాలని పార్టీ నాయకులను కోరారు. అనంతరం గ్రామ సచివాలయాలు, ప్రైవేట్ పాఠశాలలు, మండల పరిషత్ ఉద్యోగులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో భానుప్రకాష్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

వేలం వాయిదా ప్రకటన
మహారాజశ్రీ నంద్యాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP No : 146/2019 in OS.No.259/2010

ఎన్. మహబూబ్ భాషా ...D.Hr
Versus
1) దూదేకుల చిన్న మౌలాలి (లేట్)
2) దూదేకుల అలిమాబి
3) దూదేకుల షమినా
4) దూదేకుల చాంద్‌భాషా, గడివేముల గ్రామము మరియు మండల నంద్యాల జిల్లా. ...J.Drs

పై నెంబరు అమలు అర్జీలోని D.Hr, డిక్రి అయక బాకీ మొత్తము రూ. 1,43,063.00లు J.Drs వద్ద నుంచి రాగోరి పై నెంబరు అర్జీ షెడ్యూలు దాఖలు ఆస్తిని వేలం కోరగా, కోర్టువారు వేలమునకు గాను 21-03-2023 వ తేది వాయిదా వేసినారు. కావున కావలసిన సవాలుదారులు పై తేదిన ఉదయం 10.30 గంటలకు పై కోర్టుకు హాజరై వేలం పాల్గొనవచ్చును.

షెడ్యూలు: కర్నూలు.డి ఓర్వకల్లు సబ్.డి.లో చేరిన గడివేముల గ్రామములోని J.Drs యొక్క హక్కు అనుభవంలో గలస్థిరాస్తి యొక్క వివరం. S.No : 282/A డోర్ నెంబరు పాతది 3/18 కొత్త డోరు నెంబరు 1/69 మట్టిమిద్దె
దిశలు : తూర్పు : J.Drs తాల్కు భూమి, పడమర : ఖాసింసాబ్ ఇల్లు, ఉత్తరం : ఖాసిం ఖాసింసాబ్ ఇల్లు, దక్షిణం : రస్తా
కొలతలు : తూర్పు – పడమర : 5 3/4 గజాలు లేక 17 1/4 అడుగులు లేక 5.25 మీటర్లు
ఉత్తరం – దక్షిణం : 9 గజాలు లేక 27 అడుగులు లేక 8.23 మీటర్లు
NB : EC.తో పమిన తగాదాలు లేవు
D.Hr విలువ రూ. 1,00,000.00
అమీనా విలువ రూ. 2,00,000.00
S.R.O విలువ రూ. 1,50,030.00
J.Drs విలువ తెలుపలేదు.
వాయిదా తేది: 21-03-2023

శ్రీ చేపూరి మద్దిలేటి, BABL
D.Hr అడ్వకేట్, నంద్యాల - 518501.